# బలగం TV BALAGAM

నిజమే మా బలం.. ప్రజలే మా బలగం

BALAGAM TV DIGITAL NEWS PAPER | balagamtv100@gmail.com

హైదరాబాద్ శుక్రవారం 15 నవంబర్ 2024 | www.balagamtv.com | పేజీలు 4





## గ్రూప్ - 4 ఫలితాలు విడుదల

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్, గ్రూప్ - 4 ఫలితాలను వెల్లడించింది. 8,084 మందితో కూడిన ప్రొవిజనల్ లిస్ట్‌ను విడుదల చేసింది. 2022 డిసెంబర్ 1న ఇచ్చిన నోటిఫికేషన్?లో భాగంగా 8,180 పోస్టులకు గాను 9లక్షల 51వేల 321 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నట్లు కమిషన్ పేర్కొంది. పలు దఫాల్లో ధ్రువపత్రాల పరిశీలన అనంతరం ఇవాళ ఫలితాలు వెల్లడించింది. పూర్తి వివరాల కోసం టీజీపీఎస్సీ అధికారిక వెబ్‌సైట్ ను సందర్శించాలని సూచించింది.





## ప్రధాని మోడీకి

# డొమినికా దేశ అత్యున్నత అవార్డు

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

భారత ప్రధానమంత్రి నరేంద్రమోడీ మరో అరుదైన గౌరవం లభించింది. ప్రధాని మోదీకి కామన్వెల్త్ ఆఫ్ డొమినికా తమ దేశ అత్యున్నత జాతీయ అవార్డును ప్రకటించింది. ఈ మేరకు ఆ దేశ ప్రభుత్వం గురువారం ఓ ప్రకటన విడుదల చేసింది. కొవిడ్ సమయంలో డొమినికాకు భారత్ అందించిన సహకారాన్ని గుర్తిస్తూ ఈ పురస్కారాన్ని అందజేయనున్నట్లు తెలిపింది. ఇరు దేశాల మధ్య సంబంధాలను బలోపేతం చేయడానికి మోదీ విశేష కృషి చేశారని కొనియాడింది. వచ్చేవారం గయానాలో జరిగే ఇండియా-కరికోమ్ సదస్సులో ఆ అవార్డును ప్రదానం చేయనున్నట్లు వెల్లడించింది. నవంబరు 19 నుంచి 21 మధ్య ఈ సదస్సు జరగనుంది. "2021 ఫిబ్రవరిన ప్రధాని మోదీ డొమినికాకు 70వేల కొవిడ్ వ్యాక్సిన్ డోసులను పంపించారు. ఆ అపురూప కానుక వల్ల మేం మా పొరుగు దేశాలకు అండగా నిలవగలిగాం. అంతేకాదు.. ప్రధాని మోడీ నేతృత్వంలో ఆరోగ్యం, విద్య, ఐటీ రంగంలో భారత్ మాకు మద్దతు అందిస్తోంది. భారత్ మాకు గొప్ప భాగస్వామి. అందుకే ఆ దేశ ప్రధానిని మా అత్యున్నత పురస్కారంతో సత్కరించాలని నిర్ణయించాం" అని డొమినికా ప్రధాని కార్యాలయం వెల్లడించింది.

# ప్రజా ప్రభుత్వం పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి



- ప్రజాపాలన-విజయోత్సవాలపై సీఎం రేవంత్ సమీక్ష

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

తెలంగాణలో ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తొలి ఏడాది కాలంలో సాధించిన విజయాలు, చేపట్టిన కార్యక్రమాలు, వివిధ పథకాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు సూచించారు. ప్రభుత్వం ఏర్పడి ఏడాది కావొస్తున్న నేపథ్యంలో చేపట్టనున్న "ప్రజాపాలన %-% ప్రజా విజయోత్సవ" కార్యక్రమాలపై సీఎంగారు, డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క గారు, మంత్రులు, ఉన్నతాధికారుల సమావేశంలో సమీక్షించారు.

ప్రజాపాలన విజయోత్సవాలకు సంబంధించి డిసెంబర్ 9 వరకు చేపట్టనున్న కార్యక్రమాలను అధికారులు ముఖ్యమంత్రి గారికి వివరించారు. ఒకవైపు సంక్షేమ పథకాలు అమలు చేస్తూనే ఏడాది కాలంలోనే ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినందున వాటన్నింటినీ ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన అవసరం ఉందని సీఎం చెప్పారు. ఈ ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా మూడు ప్రాంతాలు వరంగల్, కరీంనగర్, మహబూబ్‌నగర్ జిల్లాల్లో బహిరంగ సభలు నిర్వహిస్తారు. మహిళల సాధికారత, రైతుల సంక్షేమం, యూత్ ఎంపవర్‌మెంట్‌కు ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇచ్చిన నేపథ్యంలో వాటికి సంబంధించి ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లేందుకు వివిధ కార్యక్రమాలు చేపడుతారు.

ఈ నెల 19న వరంగల్ వేదికగా 22 జిల్లాల్లో ఇందిరా మహిళా శక్తి భవనాలకు సీఎం శంకుస్థాపన చేస్తారు. డిసెంబర్ 7, 8, 9 తేదీల్లో హైదరాబాద్ ట్యాంక్‌బండ్, సెక్రటేరియట్, నెక్లెస్‌రోడ్ పరిసరాల్లో విజయోత్సవ వేడుకలు నిర్వహిస్తారు. సీఎం చేతుల మీదుగా డిసెంబర్ 9న సచివాలయం ఆవరణలో ఏర్పాటు చేయనున్న తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణ. ఇందుకు రాష్ట్ర వ్యాప్తంగా మహిళలకు ఆహ్వానం. ఈ విజయోత్సవాల నేపథ్యంలో నియోజకవర్గాల వారీగా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడంతో పాటు తొలి ఏడాదిలో ప్రభుత్వం సాధించిన విజయాలు, కార్యక్రమాలపై శాఖలు, విభాగాల వారిగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని నిర్ణయించారు. ఈ సమావేశంలో మంత్రులు శ్రీధర్ బాబు గారు, పొన్నం ప్రభాకర్ గారు, ఎమ్మెల్సీ, పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ గారు, ప్రభుత్వ సలహాదారులు వేం నరేందర్ రెడ్డి గారు, కె.కేశవరావు గారు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి గారితో పాటు వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## నాణ్యమైన ఆహారం సరఫరా చేయని వారిపై

# కఠినమైన చర్యలు తప్పవు

- సీఎం ఏ బియ్యం తింటున్నారో గురుకుల హాస్టళ్లలో బిడ్డలకు కూడా అదే అన్నం
- ప్రజాప్రతినిధులు, అధికారులు పాఠశాలలను సందర్శించండి
- త్వరలో వర్సిటీల్లో టీచింగ్, నాన్‌టీచింగ్ ఖాళీల భర్తీ
- వ్యసనాలకు బానిసలం కాబోమని విద్యార్థులంతా నాకు మాట ఇవ్వండి.
- ఎల్బీ స్టేడియంలో బాలల దినోత్సవ సభలో సీఎం రేవంత్‌రెడ్డి




**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

"రాష్ట్రంలో ముఖ్యమంత్రి, మంత్రులు, ప్రజాప్రతినిధులు ఏ సన్నబియ్యంతో తింటున్నారో గురుకుల హాస్టళ్లలో ఉంటున్న మా బిడ్డలకు కూడా అదే అన్నం పెట్టాలని చెప్పాం. ప్రభుత్వ హాస్టళ్లలో ఉండి చదువుతున్న ఆ బిడ్డలు తెలంగాణ ఆత్మగౌరవం. భావి భారత నిర్మాతలు. వారికి నాణ్యమైన ఆహారం సరఫరా చేయని వారిపై కఠినమైన చర్యలు తప్పవు" అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హెచ్చరించారు.

పండిట్ జవహర్ లాల్ నెహ్రూ గారి జయంతి రోజున జరుపుకునే బాలల దినోత్సవాన్ని రాష్ట్ర ప్రభుత్వం వేలాది మంది విద్యార్థినీ విద్యార్థుల సమక్షంలో ఎల్బీ స్టేడియంలో నిర్వహించింది.



అంగన్‌వాడీ విద్యార్థుల కోసం ప్రత్యేక యూనిఫామ్, ప్రియదర్శిని పేరుతో ప్రత్యేక పాఠ్య పుస్తకాలను డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క , ఇతర మంత్రులతో కలిసి విడుదల చేశారు ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ, '11 నెలల పాలనలో తనకు అత్యంత సంతోషాన్ని ఇచ్చిన రోజు. ఈరోజును మరిచిపోలేను' అన్నారు. విద్యా రంగానికి ప్రజా ప్రభుత్వం ఇస్తున్న ప్రాధాన్యతను సీఎం వివరించారు. విద్య రంగానికి ప్రాధాన్యత ఇచ్చినప్పుడే రాష్ట్రం అభివృద్ధి పథంలో పయనిస్తుంది. అందుకే బడ్జెట్‌లో 7 శాతానికి పైగా నిధులు కేటాయించాం. గురుకులాల్లో పిల్లలకు సన్నబియ్యంతో మంచి ఆహారం అందించాలని ఆదేశించాం. అందుకే సన్నాలకు రూ. 500 బోనస్ ఇచ్చి కొంటున్నాం.

నాణ్యమైన భోజనం అందించాలనే డైట్ చార్జీలను పెంచాం. అలాగే కాస్మొటిక్ చార్జీలను పెంచాం. గ్రీన్ చానెల్ ద్వారా నిధులు మంజూరు చేయాలని ఆదేశాలిచ్చాం. బడులు తెరిచిన రోజునే పుస్తకాలు, యూనిఫామ్స్ అందించాం. 20 వేల మంది టీచర్లకు పదోన్నతులు, ఎలాంటి వివాదాలకు తావులేకుండా 35 వేల మంది టీచర్ల బదిలీలు, డీఎస్సీ ద్వారా 11 వేలకుపైగా ఉపాధ్యాయ పోస్టుల భర్తీతో పాటు విద్యా కమిషన్ ను ఏర్పాటు చేశాం. గడిచిన దశాబ్దకాలంలో నిర్వీర్యమైన యూనివర్సిటీలకు పూర్వ వైభవం తేవాలన్న లక్ష్యంతో 10 వర్సిటీలకు వీసీలను నియమించడమే కాకుండా త్వరలోనే టీచింగ్, నాన్ టీచింగ్ పోస్టులను భర్తీ చేయబోతున్నాం. కులగణన వల్ల సంక్షేమ కార్యక్రమాలు నిలిపివేస్తారంటూ జరుగుతున్న తప్పుడు ప్రచారాన్ని తిప్పికొట్టాలి అని అన్నారు. ప్రజా ప్రతినిధులు పాఠశాలలను సందర్శించాలి. కలెక్టర్లు వారంలో రెండు రోజులు ప్రభుత్వ బడులను పర్యవేక్షించాలని చెప్పారు.

సమాజం వ్యసనాల వైపు వేగంగా పరుగెత్తుతోంది. చదువుకునే విద్యార్థులు గంజాయి, డ్రగ్స్‌కు బానిసలు అవుతున్న పరిస్థితి. వ్యసనాలకు బానిసలం కాబోమని విద్యార్థులంతా నాకు మాట ఇవ్వండి. సమాజంలో ఉన్నత చదువులు చదివి ఉన్నత స్థానాలకు చేరతామని చెప్పండి. చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ విద్యార్థుల కోసం అంతర్జాతీయ ప్రమాణాలతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ అందుబాటులోకి తీసుకురాబోతున్నాం. ఈ ప్రయత్నంలో ఎన్ని అడ్డంకులు వచ్చినా, ముళ్ల కంచెను తొలగించి బంగారు బాట వేసే బాధ్యత తీసుకుంటా. యువతరాన్ని ప్రోత్సహించాలి. శాసనసభకు పోటీ చేయడానికి గరిష్ట వయో పరిమితిని 21 ఏళ్లకు తగ్గించాలని కోరుతూ వచ్చే అసెంబ్లీలో తీర్మానం చేయాలని మంత్రి శ్రీధర్ బాబుని కోరుతున్నా అన్నారు. గతంలో ఏ ముఖ్య మంత్రి మీతో నడిచి మీతో చేయి కలుపలేదు. మీతో బాలల దినోత్సవం నిర్వహించుకోవడం ఎంతో సంతోషానిచ్చిందని అన్నారు.

## చట్ట సభల్లో పోటీకి వయో పరిమితిని 21 ఏళ్లకు తగ్గించాలి

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

దేశంలో చట్ట సభలకు పోటీ చేయడానికి వయో పరిమితిని 25 నుంచి 21 ఏళ్లకు తగ్గించాలని కోరుతూ పిల్లల మాక్ అసెంబ్లీ తీర్మానం చేసి దేశ ప్రధానమంత్రికి, రాష్ట్రపతికి పంపించాలని ముఖ్యమంత్రి రేవంత్ కోరారు. వయోపరిమితి 21 ఏళ్లకు తగ్గించడం వల్ల యువత చట్ట సభల్లోకి రావడానికి అవకాశం ఏర్పడటమే కాకుండా వారి అవసరాలకు అనుగుణంగా నిర్ణయాలు చేసి రాణిస్తారని అన్నారు.

దేశ తొలి ప్రధాని పండిట్ జవహర్ లాల్ నెహ్రూ జయంతి రోజున బాలల దినోత్సవం పురస్కరించుకుని ఎస్‌సీఈఆర్‌టీ ప్రాంగణంలో 18 ఏళ్ల లోపు బాలబాలికలు మాక్ అసెంబ్లీని అద్భుతంగా నిర్వహించారు. ఈ అసెంబ్లీలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి పొన్నం ప్రభాకర్ తో కూర్చొని వీక్షించించిన అనంతరం ముఖ్యమంత్రి మాట్లాడారు. ఎంతో క్రమశిక్షణతో చిల్డ్రెన్ మాక్ అసెంబ్లీ నిర్వహించారంటూ అభినందించారు. ఆనాటి ప్రధాని రాజీవ్ గాంధీ నాయకత్వంలో దేశంలో ఓటు హక్కును 21 ఏళ్ల నుంచి 18 ఏళ్లకు తగ్గించారని గుర్తుచేస్తూ చట్ట సభలకు పోటీ చేయడానికి విధించిన వయో పరిమితిని కూడా 25 నుంచి 21 ఏళ్లకు తగ్గించాలని కోరుతూ తీర్మానం చేయాలి అని అన్నారు. ఆ తీర్మానాన్ని రాష్ట్ర ఎంపీలకు పంపించాలని.. తద్వారా పార్లమెంట్ సమావేశాల్లో వారు ఈ అంశాన్ని లేవనెత్తడానికి అవకాశం ఉంటుందని పేర్కొన్నారు.

"ఈ రోజుల్లో కొందరు చట్ట సభలను ఎప్పుడు వాయిదా వేయిద్దామన్న దిశగా ఆలోచన చేయడం దురదృష్టకరం. రాజకీయాలంటే ఈనాడు ఒక రకమైన భావన నెలకొంది. మాక్ అసెంబ్లీ నిర్వహించిన వారిలో కొందరైనా రాజకీయాల్లోకి రావాలి. మాక్ అసెంబ్లీలో అండర్ 18 హెడ్ క్వార్టర్స్, మాదక ద్రవ్యాల నియంత్రణ, హైడ్రా వంటి బిల్లులపై చర్చించడం అభినందనీయం.



పండిట్ నెహ్రూ గారు దేశంలో తీసుకొచ్చిన విద్య, వ్యవసాయ విప్లవం వల్ల సమాజంలో అనేక అవకాశాలు వచ్చాయి. యూపీఏ చైర్ పర్సన్ సోనియాగాంధీ, ప్రధాని మన్మోహన్ సింగ్ కృషితో దేశంలో నిర్బంధ విద్య అమలులోకి వచ్చింది. ఇలాంటి మాక్ అసెంబ్లీ సమావేశాలు సమాజానికి చాలా అవసరం. చట్ట సభల్లో జరుగుతున్న చర్చలు, ఇతర అంశాలను విద్యార్థులు గమనించాలి" అని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు.

# కారుణ్య నియామకం హక్కు కాదు

- ఉద్యోగం కల్పించాలనే నిబంధన లేదు
- సుప్రీంకోర్టు

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

కారుణ్య నియామకం ద్వారా ప్రభుత్వ ఉద్యోగం పొందడం హక్కు కాదని సుప్రీం కోర్టు స్పష్టం చేసింది. విధులు నిర్వహిస్తూ ప్రభుత్వ ఉద్యోగి మరణిస్తే ఆయన కుటుంబ సభ్యులకు ఉద్యోగ అవకాశం కల్పించాలనే నిబంధన ఏదీ లేదని తెలిపింది. 1997లో మరణించిన ఓ పోలీసు కానిస్టేబుల్ కుమారుడు దాఖలు చేసుకున్న పిటిషన్‌ను కొట్టేస్తూ కోర్టు ఈ మేరకు పేర్కొంది. అమల్లో ఉన్న విధానానికి, చట్టానికి వ్యతిరేకంగా, ఓ వ్యక్తి లేదా సమూహానికి అనుకూలంగా వ్యవహరించాలని ప్రభుత్వాన్ని ఆదేశించలేమంటూ జస్టిస్ అభయ్ ఎస్ ఓకా, జస్టిస్ అహ్‌సానుద్దీన్ అమానుల్లా, జస్టిస్ అగస్టీన్ జార్జ్ మాసిహ్‌తో కూడిన ధర్మాసనం తెలిపింది. సాధారణంగా జరిగే కారుణ్య నియామకం ప్రభుత్వోద్యోగి మరణంతో అతడి కుటుంబం తక్షణ ఆర్థిక ఇబ్బందులకు గురికారాదనే ఉద్దేశంతో జరిగేదే తప్ప సుదీర్ఘ కాలం తర్వాతా పొందే హక్కు కాదని తీర్పు వెలువరించింది.

హరియాణాకు చెందిన పిటిషనర్ టింకూ తండ్రి జై ప్రకాశ్ 1997లో విధుల్లో ఉండగా మరణించారు. ఆ సమయానికి టింకూ వయసు ఏడేళ్లు. ఆమె తల్లి నిరక్షరాస్యురాలు. దీంతో ఆమె కారుణ్య నియామకానికి దరఖాస్తు చేసుకోలేదు. అయితే తన కుమారుడి పేరును మైనర్ల జాబితాలో చేర్చాలని అభ్యర్థించారు. తద్వారా మేజర్ అయిన తరవాత అతనికి కారుణ్య నియామకం ద్వారా ఉద్యోగం వస్తుందని ఆశించారు. ఈ క్రమంలో భవిష్యత్తులో ఉద్యోగావకాశం కల్పించేందుకు వీలుగా 1998లో టింకూ పేరును అప్పటి హరియాణా డీజీపీ నమోదు చేయించారు. తండ్రి మరణించిన 11 ఏళ్లకు 2008లో మేజరైన టింకూ ఉద్యోగానికి దరఖాస్తు చేసుకున్నారు. అయితే ఉద్యోగి మరణించిన మూడేళ్లలోపు కారుణ్యనియామకానికి దరఖాస్తు చేసుకోవాలంటూ 1999లో



తీసుకొచ్చిన నిబంధనను అనుసరించి అధికారులు టింకూ అభ్యర్థనను తోసిపుచ్చారు. దీన్ని సవాలు చేసినా టింకుకు కింది కోర్టులు సహా పంజాబ్-హరియాణా హైకోర్టులోనూ వ్యతిరేకంగానే తీర్పులు వచ్చాయి. తాజాగా సుప్రీం కోర్టు కూడా పూర్వ తీర్పులనే సమర్థించింది. అయితే అతని కుటుంబానికి ఊరట కలిగిస్తూ ఏకమొత్తంలో పరిహారం కోరుతూ సంబంధిత అధికార విభాగానికి విజ్ఞప్తి చేసుకోవడానికి టింకూ తల్లికి అవకాశమిచ్చింది. అలాగే ఆమె అభ్యర్థనపై ఆరు వారాల్లోగా నిర్ణయం తీసుకోవాలని ఆదేశించింది. ఆపై జరిగే ఆలస్యానికి వడ్డీ కూడా చెల్లించాల్సి వస్తుందని సంబంధిత విభాగానికి సూచించింది.

## రైతుల ఆవేదనకు రాజకీయ రంగు పులిమి

# భూములు గుంజుకునే కుట్ర

- లగచర్ల రైతులపై పోలీసులు థర్డ్ డిగ్రీ ప్రయోగించి చిత్ర హింసలు పెట్టారు.
- ఈ ప్రభుత్వ దుర్మార్గాలపై పోరాటానికి ప్రజా సంఘాలు, మహిళా సంఘాలు అన్ని పార్టీలు కలిసి రావాలి.
- బాధిత మహిళలను చూస్తుంటే ఎవరో చెబితే దాడులు చేసే వారిలా కనిపిస్తున్నారా?
- న్యాయ సాయం అందిస్తాం.. రైతుల తరఫున పోరాటం చేస్తాం.
- లగచర్ల గిరిజన రైతుల బాధిత కుటుంబాల మహిళలు కలిసిన సందర్భంగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్


వివరాలు 3వ పేజీలో






## 20 లోపు వివిధ పారా మెడికల్ కోర్స్ దరఖాస్తులు సమర్పించాలి..

● కలెక్టర్ సందీప్ కుమార్ ఝ

**బలగం టీవీ , రాజన్న సిరిసిల్ల**

డీఏఎన్ఎస్ (డిప్లమా ఇన్ అనస్థీషియా టెక్నికల్ కోర్స్) , డీఈసిజి (డిప్లమా ఇన్ ఈసిజి టెక్నీషియన్ కోర్స్) చేసేందుకు ఆసక్తి గల అభ్యర్థులు నవంబర్ 20 లోపు దరఖాస్తులు సమర్పించాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా మాట్లాడుతూ సిరిసిల్ల జిల్లాలో డిఏఎన్ఎస్ కోర్సు కు సంబంధించి 30 సీట్లు, డిఈసిజి. కోర్సు కు 30 సీట్లు ఉన్నాయని, ఇప్పటివరకు రెండు కోర్సులకు కలిపి మొత్తం 57 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. రెండు సంవత్సరాల డిప్లమా కోర్సులు చేసేందుకు ఇంటర్మీడియట్ ఉత్తీర్ణత సాధించాలని అన్నారు.

డిప్లొమా కోర్సులకు సంవత్సరం 6000 రూపాయల ట్యూషన్ ఫీ ఉంటుందని, దీనిని ఈ పాస్ ద్వారా రియంబర్స్ చేయడం జరుగుతుందని అన్నారు. సీట్ల కేటాయింపు సమయంలో రూల్ ఆఫ్ రిజర్వేషన్ పాటిస్తామని, ఈ కోర్సులలో నమోదు చేసుకునేందుకు పారామెడికల్ బోర్డు నవంబర్ 20 వరకు గడువు విధించిందని, ఆసక్తి గలవారు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు.



## వైద్య విధాన పరిషత్ ఆసుపత్రులలో వైద్యుల నియామకం...

● రాజన్న సిరిసిల్ల జిల్లా ఆసుపత్రుల సమన్వయాదికారి డా. పెంచలయ్య

**బలగం టీవీ , సిరిసిల్ల**

వేములవాడ, ఎల్లారెడ్డిపేట ఆసుపత్రులలో వివిధ నిపుణులైన వైద్యలను నియమించడం జరిగిందని రాజన్న సిరిసిల్ల జిల్లా ఆసుపత్రుల సమన్వయాదికారి డా. పెంచలయ్య గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా ఆసుపత్రుల సమన్వయాదికారి డా. పెంచలయ్య మాట్లాడుతూ కలెక్టర్ సందీప్ కుమార్ ఝా నిర్ణయం మేరకు జిల్లా లోని వంద పడకల వేముల వాడ ప్రభుత్వ ఆస్పత్రుల్లో లో ముగ్గురు స్త్రీ వైద్య నిపుణురాల్లు ,ఒక శస్త్ర చికిత్స నిపుణుడు మరో స్త్రీ వైద్యురాలుని,ఎల్లారెడ్డిపేట 30 పడకల ఆసు పత్రి లో చిన్న పిల్లల వైద్య నిపుణున్ని నియమించినట్లు తెలిపారు.జిల్లా ప్రజలు ఈ సౌకర్యాలను సద్వినియోగించుకోవాలని, వేములవాడ ప్రజలకు స్కానింగ్ సౌకర్యం అందుబాటులోకి తీసుకు రావడంతో పాటు, పోస్ట్ మార్టం సేవలు కూడా అందుబాటులోకి తీసుకు వచ్చామని అన్నారు.ఆసుపత్రులకు వచ్చే రోగులకు ఎటువంటి అసౌకర్యాలు కలిగిన తనను సంప్రదించాలని సూచించారు. కలెక్టరు సందీప్ కుమార్ ఝా,ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ కృతజ్ఞతలు తెలిపారు.



## వరి ధాన్యం దళారులకు అమ్మి మోసపోవద్దు..

**బలగం టీవీ , సిరిసిల్ల**

రైతులు కష్టపడి పండించిన ధాన్యాన్ని మాయమాటలు చెప్పే దళారులకు అమ్మి మోసపోవద్దని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు.గురువారం ఎల్లారెడ్డిపేట మండలం వెంకటాపుర్ ,గంభీరావుపేట మండలం సముద్రాలలింగపూర్,గోరంటల గ్రామాలలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఎస్పీ అఖిల్ మహాజన్ సందర్శించి విధుల్లో ఉన్న అధికారులను కొనుగోలు ప్రక్రియను గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం కొనుగోలు కేంద్రం వద్ద ఉన్న రైతుల సమస్యలు అడిగి తెలుసుకొని సంబంధిత అధికారులుదృష్టికి తీసుకెళ్లి వాటిని పరిష్కరిస్తామని తెలిపారు.దాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద ఎలాంటి సమస్యలు ఎదురైనా వెంటనే స్థానిక పోలీస్ అధికారులకు సమాచారం అందించాలని కోరారు.ఈ కార్యక్రమంలో డిఎస్పీ చంద్రశేఖర్ రెడ్డి, సిఐ శ్రీనివాస్, సిబ్బంది ఉన్నారు.

## సచివాలయం వెనుక కూలిన భారీ వృక్షం

● వ్యక్తికి గాయాలు



**బలగం టీవీ , హైదరాబాద్**

డా.బీఆర్ అంబేద్కర్ తెలంగాణ సచివాలయం వెనుక భాగంలోని మింట్ కాంపౌండ్‌లో ఓ భారీ వృక్షం కూలింది. ప్రభుత్వ ప్రింటింగ్ ప్రెస్ ముందు ఒక్కసారిగా అటువైపుగా వెళ్తున్న ఆటోపై కూలడంతో ఒకరికి గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు హాస్పిటల్‌కు తరలించారు. సమాచారం అందుకున్న ట్రాఫిక్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని వృక్షాన్ని తొలగించి ట్రాఫిక్ క్లియర్ చేశారు.

# పకడ్బందీగా గ్రూప్ -3 పరీక్షలు నిర్వహించాలి..

● ఉదయం 09.30 గంటల తరువాత అనుమతి లేదు

● ఎస్పీ అఖిల్ మహాజన్, అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్



**బలగం టీవీ , రాజన్న సిరిసిల్ల :**

ఈ నెల 17, 18 తేదీల్లో రాజన్న సిరిసిల్ల జిల్లాలోని అన్ని కేంద్రాల్లో గ్రూప్ -3 పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని ఎస్పీ అఖిల్ మహాజన్, అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్ ఆదేశించారు. గురువారం గ్రూప్ -3 పరీక్షల నిర్వహణపై జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలోని ఆడిటోరియంలో అబ్జర్వర్స్, డిపార్ట్మెంటల్ ఆఫీసర్స్, చీఫ్ సూపర్ఇండెంట్స్, ఫ్లయింగ్ స్క్వాడ్ టీమ్స్ కు శిక్షణ ఇచ్చారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం, టీజీ పీఎస్సీ ఆదేశాల మేరకు జిల్లాలో ఈ నెల 17 ఆదివారం రోజున ఉదయం 10.00 నుంచి 12.30 గంటల వరకు, మధ్యాహ్నం 03.00 నుంచి 05.30 వరకు,తేది 18 సోమవారం రోజున ఉదయం 10.00 నుంచి 12.30 గంటల వరకు పరీక్షలు నిర్వహించనున్నమని అన్నారు . పరీక్షకు మొత్తం 7062 మంది పరీక్షకు హాజరుకానున్నారని, మహిళలు 3359, పురుషులు 3701, ట్రాజెండర్స్ 02 పరీక్షలు రాయనున్నారని అన్నారు.

### ప్రతి అభ్యర్థిని తప్పనిసరిగా తనిఖీ..

పరీక్ష కేంద్రంలో అధికారులు నిర్వర్తించాల్సిన, నిర్వర్తించకకూడని విధులపై వివరించారు. ప్రతి అభ్యర్థిని తప్పనిసరిగా క్షుణ్ణంగా తనిఖీ చేసిన తరువాతే కేంద్రంలోనికి అనుమతించాలని అన్నారు.

### అభ్యర్థుల బయోమెట్రిక్ అటెండెన్స్..

అభ్యర్థులు బయో మెట్రిక్ అటెండెన్స్ తీసుకుంటారని, ముందుగానే కేంద్రానికి చేరుకుంటే సౌకర్యంగా ఉంటుందని తెలిపారు. పరీక్ష కేంద్రంలో సమయం తెలుసుకునేందుకు బెల్ ఉంటుందని అన్నారు.

### జిల్లాలో 25 పరీక్షా కేంద్రాలు.

ఉదయం 09.30 గంటల తరువాత, మధ్యాహ్నం 02.30 గంటల తరువాత అభ్యర్థులకు, మొబైల్ ఫోన్లకు అనుమతి లేదని అన్నారు . జిల్లాలో మొత్తం సిరిసిల్ల నియోజకవర్గం లో 18 కేంద్రాలు, వేములవాడ నియోజకవర్గం లో 7 కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు, ఐదు ప్రభుత్వ పాఠశాలలు, ఏడు ప్రైవేట్ పాఠశాలలు, ప్రభుత్వ, ప్రైవేట్ జూనియర్ కళాశాలాల్లో రెండు చొప్పున, అగ్రహారం పాలిటెక్నిక్ కళాశాల, అగ్రహారం డిగ్రీ కళాశాల, ఏడు ప్రైవేట్ డిగ్రీ కళాశాలల్లో కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు . మొత్తం అబ్జర్వర్స్ 25, డిపార్ట్మెంటల్ ఆఫీసర్స్ 25 చీఫ్ సూపర్ఇండెంట్స్ 25, ఫ్లయింగ్ స్క్వాడ్ టీమ్స్ 05, దివ్యాంగుల కేంద్రాలు 02 ఉన్నట్లు,పరీక్షకు ఒక రోజు ముందు అన్ని పరీక్ష కేంద్రాల్లో గదులు, ఇతర ఏర్పాట్లు తనిఖీ చేయాలని అన్నారు .

### సమన్వయంతో పనిచేయాలి..

అన్ని పరీక్ష కేంద్రాల్లో వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో సిబ్బంది మందులు ఏర్పాటు చేయాలని సూచించారు. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా బస్ లు వేయాలని, సిరిసిల్ల, వేములవాడ మున్సిపల్ కమిషనర్లు ఆయా కేంద్రాల్లో పరిశుభ్రత పనులు, తాగు నీటి వసతి కల్పించాలని ఆదేశించారు. సెస్ అధికారులు విద్యుత్ సరఫరాలో ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకోవాలనిఅన్నారు .

### అన్ని పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్

అన్ని పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేస్తామని ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. పరీక్ష కేంద్రాల వద్ద జీరాక్స్ సెంటర్లు మూసి ఉంచుతామని,పరీక్ష కేంద్రానికి వచ్చే ప్రతి అధికారి, సిబ్బందికి ఐడీ కార్డు ఉంటుందని అన్నారు . ఒక్కో కేంద్రానికి ఎస్ఐ నీ కేటాయించామని,అన్ని పరీక్ష కేంద్రాల్లో విద్యుత్ దీపాలు, ఫ్యాన్స్ ఉండేలా చూసుకోవాలని ఆర్ సీ ఓ కు సూచించారు.

పరీక్ష మొదలైన తర్వాత ముగిసే వరకు ఎవరూ బయటికి వెళ్ళడానికి అనుమతి లేదని స్పష్టం చేశారు. ప్రతి అభ్యర్థి ఒక రోజు ముందే పరీక్ష కేంద్రాన్ని సరి చూసుకోవాలనిఅన్నారు . ఈ సమావేశంలో అదనపు ఎస్పీలు చంద్రయ్య, శేషాద్రిని రెడ్డి, డీఎస్పీ చంద్రశేఖర్ రెడ్డి, ఆర్సీఓ, జేఎన్టీయూ అగ్రహారం కళాశాల ప్రిన్సిపాల్స్ , జిల్లా అధికారులు, వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

# వికారాబాద్ కలెక్టర్ పై దాడిని ఖండిస్తూ ఉద్యోగుల నిరసన..



**బలగం టీవీ , సిరిసిల్ల,**

వికారాబాద్ జిల్లా కలెక్టర్, అడిషనల్ కలెక్టర్, ప్రభుత్వ సిబ్బందిపై జరిగిన దాడిని నిరసిస్తూ గురువారం ప్రభుత్వ ఉద్యోగులు జిల్లా కలెక్టరేట్ కార్యాలయం ముందు భోజన విరామ సమయంలో నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఉద్యోగ జేఏసీ చైర్మన్, టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు ఎలుసాని ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ కలెక్టర్, అడిషనల్ కలెక్టర్, సిబ్బందిపై ప్రజలు దాడి చేయడం అత్యంత హేమనీయమైన చర్య అని అన్నారు.ప్రభుత్వం ప్రవేశపెడుతున్న పథకాలను ప్రజలకు వివరించేందుకు బాధ్యతగా పనిచేసే ప్రభుత్వ ఉద్యోగుల పైన దాడి చేయడం సరికాదు అని,ప్రభుత్వ ఉద్యోగుల పైన దాడులు చేస్తే సహించేది లేదని అన్నారు.ప్రజల మేలు కోసం పనిచేసే ప్రభుత్వ ఉద్యోగులపైన దాడులు చేయడం సమాజంలో సరి కాదని మండిపడ్డారు. ప్రభుత్వ ఉద్యోగుల పైన దాడులు చేసిన ఎంతటి వారినైనా కఠినంగా శిక్షించి పిడి యాక్ట్ నమోదు చేయాలని డిమాండ్ చేశారు. గతంలో తహసిల్దార్ విజయరెడ్డిని పెట్రోల్ పోసి హత్య చేసిన వారిపై ఇప్పటివరకు సరైన శిక్షలు విధించ లేదన్నారు. ఇక ముందు ప్రభుత్వ ఉద్యోగులపై దాడులు చేస్తే కఠిన శిక్షలు విధించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. వికారాబాద్ కలెక్టర్, అడిషనల్ కలెక్టర్, సిబ్బందిపై దాడి చేసిన వారిపై విచారణ చేసి దాడుల్లో ప్రమేయం ఉన్న ఎంతటి వారి పైన అయినా కఠిన చర్యలు తీసుకోవాలని అన్నారు.ఈ కార్యక్రమంలో టీఎన్జీవో జిల్లా కార్యదర్శి గాజుల సుదర్శన్, ట్రెసా జిల్లా అధ్యక్షుడు జయంత్ కుమార్, అసోసియేట్ అధ్యక్షుడు మెట్ట శ్రీకాంత్, కోశాధికారి రియాజ్ పాషా, కలెక్టర్ కార్యాలయం ఏవో రాంరెడ్డి, సమర్షన్ రెడ్డి, టీటిఎఫ్ జిల్లా అధ్యక్షుడు మార్వాడి గంగరాజు, నాలుగోవ తరగతి ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కుమారస్వామి, జీవన్ ప్రభుత్వ ఉద్యోగులు పాల్గొన్నారు.

## మత్స్యకారులను అన్ని విధాలుగా ఆదుకుంటాము



● చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

**బలగం టీవీ , బోయినిపల్లి**

రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలం కొదురుపాక వద్ద గురువారం రోజున శ్రీ రాజరాజేశ్వర (మిడ్ మానేర్) ప్రాజెక్టులో చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం చేప పిల్లలను వదిలారు. రాష్ట్రంలో మత్స్య సంపద పెంచి మత్స్యకారులను అన్ని విధాలుగా ఆదుకుంటామని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు.

అనంతరం ఎమ్మెల్యే సత్యం మాట్లాడుతూ: ఇప్పటికే కరీంనగర్, జగిత్యాల జిల్లాలలో చేప పిల్లల పంపిణి పూర్తయిందని,ప్రస్తుతం మిడ్ మానేర్ ప్రాజెక్టులో వంద శాతం సబ్సిడీ తో ఉచితంగా 14 లక్షల చేప పిల్లలను, అలాగే మండలంలోని ఆయా గ్రామాలలో ఉన్న 36 చెరువులలో 2 లక్షల చేప పిల్లలను వదిలినట్లు తెలిపారు. అదనంగా అవసరం ఉంటే తమకు తెలపాలని అన్నారు. మత్స్యకారులకు ప్రమాద బీమా అమలు చేస్తున్నామని అన్నారు. మత్స్యకారుల సమస్యలను పరిష్కరిస్తామని అన్నారు. అంతకుముందు మండల పరిషత్ కార్యాలయంలో ఆయా గ్రామాలకు చెందిన 152 మంది లబ్దిదారులకు రూ. 33 లక్షల 44 వేల 500 ల విలువ గల సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణి చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా మత్స్యకారుల సహకార సంఘం చైర్మెన్ రాంచంద్రం, జిల్లా ఫిషరీష్ ఆఫీసర్ సౌజన్య, తహశీల్దార్ నారాయణరెడ్డి, ఎంపీడీఓ జయశీల, కాంగ్రెస్ జిల్లా బీసీ సెల్ అధ్యక్షులు కూస రవీందర్, మండల అధ్యక్షులు వన్నెల రమణారెడ్డి,ఏఎంసీ చైర్మెన్ బోయిని ఎల్లేష్, వైస్ చైర్మెన్ నిమ్మ వినోద్ రెడ్డి,జిల్లా ఉపాధ్యక్షులు ఏనుగుల కనుకయ్య, అనుముల హరికృష్ణ, పెండ్లి నాగరాజు, నాగుల వంశీ, మత్స్యకారులు కూస రవి, రాకం అనిల్, కళ్లెం శ్రీనివాస్, మైలారం పరశురాములు, బండి రాజశేఖర్, బండి కనకయ్య తదితరులు పాల్గొన్నారు.



## మిడ్ మానేరు నిర్వాసితులకు మత్స్య శాఖ సొసైటీలో మెంబర్షిప్ కల్పించాలి

● ఎమ్మెల్యేను వేడుకున్న నిర్వాసితులు

**బలగం టీవీ, బోయినపల్లి**

నీలోజిపల్లి, కొదురుపాక గ్రామాలలో మధ్యమానేర్ జలాశయంలో చేపలు పట్టుటకు లైసెన్స్ ఉండి దాదాపు ఇతర కులాల వారీగా 60 మంది మత్స్యకారులమున్నామని, జలాశయంలో చేపలు పట్టుకుంటూ జీవనం కొనసాగిస్తున్నామని మత్స్యకారులు తెలిపారు. మమ్మల్ని మత్స్యశాఖ సొసైటీలో చేర్చుకోవాలని, ఎమ్మెల్యే మేడిపల్లి సత్యముకు మత్స్యకారులు విన్నవించినారు. ఎమ్మెల్యే స్పందిస్తూ: మత్స్యకారులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూడాలని మత్స్యశాఖ అధికారులకు తెలిపారు. ఈ సందర్భంగా డి.ఎఫ్.ఓ సౌజన్య మాట్లాడుతూ: ముదిరాజ్, బెస్త, తెనుగు వారికి సొసైటీ రిజిస్ట్రేషన్ ఫిషర్ కమిటీ మాత్రమే ఉన్నాయని, ఇతర కులాల వారికి ప్రమాద బీమా వర్తిస్తుందని, కానీ సొసైటీ మెంబర్షిప్ లేదని సొసైటీలో లేని వారికి మత్స్యశాఖ ఉన్నత అధికారులకు నివేదిక ఇస్తామని తెలిపారు.

# గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు..

● ఎస్పీ అఖిల్ మహాజన్




**బలగం టీవీ , రాజన్న సిరిసిల్ల**

ప్రపంచంలో ఎక్కడైనా సరే జ్ఞానమే అధికారమని, అది గ్రంథాలయం తోనే సాధ్యమని, గ్రంథాలయాలను ఉపయోగించుకొని పాఠకులకు, విద్యార్థిని, విద్యార్థులు పోటీ పరీక్షలు అనే మెట్లను ఎక్కి విజయ తీరాలను చేరుకోవాలని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు.గురువారం సిరిసిల్ల జిల్లా గ్రంథాలయంలో జరిగిన 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలకు ముఖ్య అతిథి ఎస్పీ అఖిల్ మహజన్ హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఎస్పీ అఖిల్ మహజన్ మాట్లాడుతూ గ్రంథాలయాల్లో మనకు తెలియని కొత్త విషయాలను చాలా నేర్చుకోవచ్చని, ప్రతి ఒక్కరూ గ్రంథాలయాలకు వెళ్లడాన్ని అలవాటుగా మార్చుకోవాలని అన్నారు.పోటీ పరీక్షలు పుస్తకాలు తదితర ఆసక్తికరమైన అనేక పుస్తకాలు ఉన్నాయని, విద్యార్థులు తరచూ సందర్శించి జ్ఞానాన్ని పెంచుకోవాలని అన్నారు. నూతనంగా జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ గా బాధ్యతలు చేపట్టిన నాగుల సత్యనారాయణ గౌడ్ మాట్లాడుతూ గ్రంథాలయం శాంతి దేవాలయం అని గ్రంథాలయాల ద్వారానే నైతిక విలువలతో కూడిన బావి భారత పౌరులు తయారవుతారని అన్నారు. సిరిసిల్ల జిల్లాలోని అన్ని గ్రంథాలయాలను అభివృద్ధి పథంలో ముందుకు తీసుకు వెళ్తాననిఅన్నారు .సిరిసిల్ల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ స్వరూప రెడ్డి, టౌన్ అధ్యక్షులు చొప్పదండి ప్రకాష్, నాయకులు సంగీతం శ్రీనివాస్, ఎల్లె లక్ష్మీనారాయణ, గ్రంథ పాలకులు బి శంకరయ్య, కే మల్లయ్య, కే శ్రీనివాస్ మాధవి, కవిత, అనిత, సాయిబాబా, మహేష్ పాఠకులు విద్యార్థిని విద్యార్థులు

# లగచర్ల ఘటనపై విచారణ



బలగం టీవీ, హైదరాబాద్

వికారాబాద్ జిల్లా దుద్యాల మండలం లగచర్లలో అధికారులపై దాడి, అనంతరం జరిగిన పరిణామాలపై మల్టీజోన్-2 ఐజీ సత్యనారాయణ గురువారం విచారణ చేపట్టారు. పరిగి పోలీస్ స్టేషన్‌లో అదనపు డీజీ మహేశ్ భగవంత్‌తో కలిసి ఐజీ సత్యనారాయణ, వికారాబాద్ ఎస్పీ నారాయణరెడ్డి విచారించారు.

ఇక లగచర్లలో కలెక్టర్‌పై దాడి కేసులో అరెస్టయి చర్లపల్లి జెలులో 14రోజుల రిమాండ్‌లో ఏ1 నిందితుడిగా ఉన్న మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డిని కస్టడీకి కోరుతూ పోలీసులు కొడంగల్ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. నరేందర్‌రెడ్డిని 7 రోజులపాటు కస్టడీకి ఇవ్వాలని పిటిషన్‌లో పేర్కొన్నారు. దీనిపై విచారణ జరిపేందుకు కోర్టు కేసును సోమవారానికి వాయిదా వేసింది. ఇప్పటికే నరేందర్‌రెడ్డి సెల్‌ఫోన్ సీజ్ చేసిన పోలీసులు.. దాన్ని పరిశీలించేందుకు మేజిస్ట్రేట్ అనుమతి కోరారు. కేసులో మరో కీలక నిందితుడు బోగమోని సురేష్, పట్నం నరేందర్‌రెడ్డికి దాడికి సంబంధించి ఎవరి నుంచి ఆదేశాలు వచ్చాయో తెలుసుకునేందుకు పోలీసులు తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. రిమాండ్‌కు తరలించే క్రమంలో నరేందర్‌రెడ్డి తమ ప్రశ్నలకు సరైన సమాధానాలు ఇవ్వలేదని పోలీసుల అభియోగం. అసంపూర్తి సమాచారాన్ని తెలియజేశారని చెబుతున్నారు. ఈ కేసు రిమాండ్ రిపోర్టులో కేటీఆర్ పేరును పేర్కొనడం, ఆయన ప్రేరణతోనే దాడి ప్రణాళిక అమలు చేశామని నరేందర్‌రెడ్డి చెప్పినట్టుగా పోలీసులు పేర్కొనడంతో కేటీఆర్‌ను టార్గెట్‌గా చేస్తూ ముందుకు తీసుకెళు తున్నట్టుగా బీఆర్ఎస్ వర్గాలు అనుమానిస్తున్నాయి. రిమాండ్ రిపోర్టులో కేటీఆర్ పేరును చేర్చారన్న వార్తలతో ఆయనను అరెస్టు చేస్తారన్న ప్రచారం తీవ్రంగా జరుగుతోంది.

## రిమాండ్ రిపోర్టులో అన్ని నిజం కాదు : పట్నం నరేందర్ రెడ్డి

బలగం టీవీ, హైదరాబాద్

తనపై నమోదైన కేసును కొట్టివేయాలని కోరుతూ లగచర్ల ఘటనలో ఏ1 నిందితుడిగా ఉన్న కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి హైకోర్టులో క్వాష్ పిటిషన్ దాఖలు చేశారు. వికారాబాద్ జిల్లా దుద్యాల మండలం లగచర్లలో ప్రభుత్వ అధికారులపై దాడి కేసులో చర్లపల్లి జైల్లో రిమాండ్ ఖైదీగా ఉన్న నరేందర్ రెడ్డిని గురువారం న్యాయవాదులు కలిశారు. న్యాయవాదుల ద్వారా కోర్టుకు నరేందర్ రెడ్డి అఫిడవిట్ పంపించారు. "బుధవారం ఉదయం కేబీఆర్ పార్కు వద్ద మార్నింగ్ వాక్ చేస్తున్న సమయంలో తనను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. బలవంతంగా కారులో ఎక్కించి వికారాబాద్ డీటీసీకి తీసుకెళ్లారు. ఆ సమయంలో పోలీసులు నా స్టేట్‌మెంట్ తీసుకోలేదు. కోర్టులో హాజరుపరిచే 10 నిమిషాల ముందు కొన్ని పేపర్లపై నా సంతకాలు తీసుకున్నారు. నన్ను అక్రమంగా ఈ కేసులో ఇరికించారు. అరెస్టుకు ముందు నాకు ఎలాంటి నోటీసులు ఇవ్వలేదు. కేటీఆర్ సహా ఇతర ముఖ్యనేతల ఆదేశాలతో దాడులు చేయించినట్లు పోలీసులు కట్టుకథ చెప్పారు. నేను పోలీసులకు ఎలాంటి వాంగ్మూలం ఇవ్వలేదు. రిమాండ్ రిపోర్టులో పోలీసులు చెప్పినవన్నీ నిజం కాదు. నా స్టేట్‌మెంట్‌ను పరిగణనలోకి తీసుకొని విచారణ చేయాలి" అని కోర్టుకు పంపించిన అఫిడవిట్‌లో నరేందర్ రెడ్డి పేర్కొన్నారు.



## లగచర్లలో రైతుల తిరుగుబాటుపై మావోయిస్టులు సంచలన లేఖ

బలగం టీవీ, హైదరాబాద్

వికారాబాద్ జిల్లాలోని లగచర్లలో దాడి ఘటనపై మావోయిస్టులు సంచలన లేఖ విడుదల చేశారు. తెలంగాణ రాష్ట్రంలో జరుగుతున్న విధ్వసం, అప్రజాస్వామిక పాలన కేవలం ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లనో బాధ్యత రాహిత్యం వలనో జరుగుతున్నది కాదు అని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్దేశ్యపూర్వకంగా కమీషన్ల కోసం కార్పొరేట్ కంపెనీలకు కొమ్ముకాస్తోందని ఆరోపించింది. అందులో భాగమే ఈ ప్రజా ఉద్యమాలు, ప్రజల తిరుగుబాటు అని ఆ లేఖలో పేర్కొన్నారు. ఇక, కొడంగల్ లో ఫార్మా కంపెనీకి వ్యతిరేకంగా ప్రజలు చేసిన తిరుగుబాటును, రైతుల ఉద్యమాన్ని నీరుగార్చేందుకు రాజకీయ కుట్రగా చిత్రీకరించే ప్రయత్నం పాలక వర్గాలు చేస్తున్నాయని వెల్లడించింది. ప్రజలారా, తెలంగాణ బుద్ధిజీవులారా, మేధావులారా రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక అప్రజాస్వామిక పాశవిక పాలనను ఖండించండి అని మావోయిస్టుల ఆ లేఖలో ప్రస్తావించారు. అక్రమ కట్టడాలు, మూసీ నది ప్రక్షాళన పేర్లతో మధ్య తరగతి, పేద ప్రజలపై హైడ్రా కొనసాగిస్తున్న అనాగరిక బుల్డోజర్ దాడులను వ్యతిరేకించండి అని పిలుపునిచ్చారు. పర్యావరణాన్ని విధ్వసం చేస్తున్నా.. నేవి రాడార్ స్టేషన్ ను, కొడంగల్ ఫార్మా సిటీని తీవ్రంగా వ్యతిరేకిస్తూ ఉద్యమాలు చేపట్టండి అంటూ మావోయిస్టు పార్టీ పిలుపునిచ్చింది.

## రాష్ట్రంలో ఎవరు తిరుగుబాటు చేసినా బీఆర్ఎస్ కుట్ర అంటున్నారు

- ఎమ్మెల్యే హరీశ్ రావు

రాష్ట్రంలో ఎవరు తిరుగుబాటు చేసినా బీఆర్ఎస్ కుట్ర అంటున్నారని మాజీ మంత్రి, సిద్ధిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు అన్నారు. లగచర్ల దాడి కేసులో అరెస్టయిన కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డిని చర్లపల్లిలోని జైలులో ఎమ్మెల్యేలు బండారి లక్ష్మారెడ్డి, పల్లా రాజేశ్వర్‌రెడ్డిలతో కలిసి ఆయన గురువారం పరామర్శించారు. అనంతరం మీడియాతో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో రేవంత్ రెడ్డి పాలన మీద, సోకాల్డ్ ప్రజాపాలన మీద ప్రజల తిరుగుబాటు ప్రారంభమైందన్నారు. తమ భూముల తమకు కావాలని కొడంగల్ ప్రజలు కొన్ని నెలలుగా పోరాటం చేస్తుంటే స్థానిక ఎమ్మెల్యేగా ఉన్న రేవంత్ రెడ్డి వారిని ఎందుకు పిలిచి మాట్లాడటం లేదని ప్రశ్నించారు. పైగా గూండాలతో, పోలీసులతో బెదిరింపులకు



పాల్పడుతున్నారని ఆరోపించారు. ఈ అరెస్ట్ ప్రభుత్వ దిగజారుడుతనానికి నిదర్శనమన్నారు. పోలీసులు ఒకే ఒక్క సారి ఫోన్ వచ్చిందని చెబుతున్నారని.. కానీ కాంగ్రెస్ నాయకులు ప్రెస్ మీట్ పెట్టి అబద్దాలు చెబుతున్నారని తెలిపారు.

ప్రశ్నించే గొంతుక కేటీఆర్‌పై కూడా కుట్రలు చేస్తున్నారని, ప్రజలకు ఇబ్బంది తలెత్తినప్పుడు ప్రతిపక్షనేతలుగా ప్రశ్నిస్తే కేసులు పెట్టి ఇరికిస్తారా? రాష్ట్రంలో ప్రజాస్వామ్యం ఎక్కడుందని ప్రశ్నించారు. ఏ వర్గాలైతే పోరాటం చేస్తున్నాయో వారికి అండదండగా ఉండటం ప్రతిపక్షం బాధ్యత అని అన్నారు. నువ్వు(రేవంత్‌రెడ్డి) చేసే తప్పులకు, నేరాలకు, అక్రమాలకు చిడుతలు వాయిస్తూ చెక్క భజన చేయాలా అని ప్రశ్నించారు. తమకు ఉద్యమాలు, అరెస్టులు కొత్త కాదని, తననో, కేటీఆర్‌నో, తమ ఎమ్మెల్యేలను అరెస్టు చేయండి కానీ అమాయక గిరిజన రైతులను అరెస్టులు చేయడం సరికాద´న్నారు. మల్లన్నసాగర్‌లో రేవంత్ రెండురోజులు నిరసన చేస్తే తాము అడ్డుకున్నమా.. ? అని ప్రశ్నించారు. ఈ ప్రజల తిరుగుబాటు ఆగదని.. రేవంత్‌ని గద్దె దించే దాకా నిద్రపోమన్నారు. తమ ప్రభుత్వంలో 14వేల ఎకరాలు ఫార్మాసిటీ కోసం సేకరించామని.. అక్కడెందుకు ఫార్మాసిటీ కట్టరని ప్రశ్నించారు. రేవంత్ పాలన అదానీ, తమ్ముళ్లు, అల్లుళ్ల కోసమేనని.. బీఆర్ఎస్ దళిత, గిరిజనుల పక్షాన నిలబడుతుందని స్పష్టం చేశారు.

## రైతుల ఆవేదనకు రాజకీయ రంగు పులిమి

# భూములు గుంజుకునే కుట్ర

బలగం టీవీ, హైదరాబాద్

లగచర్లలో జరిగిన సంఘటనకు రాజకీయ రంగు పులిమి పేదల భూములు గుంజుకునే కుట్రను రేవంత్ ప్రభుత్వం చేస్తుందని కేటీఆర్ మండిపడ్డారు. తమ భూములు కోల్పోతామని ఆవేదనతో రైతులు నిరసన తెలిపితే వాళ్లపై థర్డ్ డిగ్రీ ప్రయోగించి అమానుషంగా వ్యవహరించారని ఆవేదన వ్యక్తం చేశారు. పోలీసులు అరెస్ట్ చేసిన రైతుల కుటుంబాలకు చెందిన గిరిజన మహిళలు తెలంగాణ భవన్ లో కేటీఆర్ ను కలిసి తమ గోడు చెప్పుకున్నారు. తమ ఇంట్లో మగవారిపై ఎంత కర్కషంగా వ్యవహరించారో చెబుతూ కంటతడి పెట్టారు. దాడితో సంబంధం లేకపోయినా కూడా తన భర్తను విపరీతంగా కొట్టి తీసుకెళ్లారని జ్యోతి అనే గర్భిణీ మహిళ పోలీసుల దాడిని కేటీఆర్ కు వివరిస్తూ కంటతడి పెట్టారు. తమ భూములు తీసుకుంటామని దాదాపు పది నెలలుగా ఇబ్బంది పెడుతున్నారని.. తమకు ఆ భూములే ఆధారమన్నారు. తమవారిని తీవ్రంగా కొట్టటంతో వాళ్లు నడవలేని పరిస్థితిలో ఉన్నారంటూ అవేదన వ్యక్తం చేశారు. ఎట్టి పరిస్థితుల్లో భూములు తీసుకుంటామని మమ్మల్ని బెదిరిస్తున్నారని మా ఆధారం పోతే ఎలా బతకాలని వారు ఆందోళన వ్యక్తం చేశారు.

బీఆర్ఎస్ వాళ్లే ఈ దాడికి కుట్ర చేశారని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సహా కాంగ్రెస్ నేతలు చేస్తున్న ఆరోపణలపై కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ గిరిజన మహిళలను చూస్తుంటే ఎవరో చెబితే దాడి చేసే వారిలా కనిపిస్తున్నారా అంటూ ప్రశ్నించారు. ఫార్మా విలేజ్ వస్తే ఏం ప్రయోజనం కూడా వారికి చెప్పే ప్రయత్నం ఈ ప్రభుత్వం చేయలేదని కేటీఆర్ అన్నారు. జానెడు భూమి కోసం పోరాటం చేస్తున్న రైతుల పై ఇంత పాశవికంగా దాడి చేయటమేమిటని కేటీఆర్ ప్రశ్నించారు.

గిరిజన రైతుల కుటుంబాలకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. పోలీసులు అరెస్ట్ చేసిన వారి కుటుంబ సభ్యులను విడిపించే వరకు పూర్తిగా బీఆర్ఎస్ పార్టీ తోడుగా ఉంటుందని హామీ ఇచ్చారు. గర్భిణీ మహిళ జ్యోతికి వైద్య సాయం అందిస్తామన్నారు. లగచర్లలో రైతులపై పోలీసులు అమానుష దాడిని జాతీయ మానవహక్కుల కమిషన్, రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ సుమాటోగా స్వీకరించి విచారణ జరపాలని కేటీఆర్ విజ్ఞప్తి చేశారు. ఈ ప్రభుత్వం చేస్తున్న దుర్మార్గాలను ఎదుర్కొనేందుకు ప్రజాసంఘాలు, గిరిజన, దళిత సంఘాలు, మహిళా సంఘాలు ముందుకు రావాలన్నారు. అన్ని పార్టీలు కలిసి ప్రభుత్వంపై పోరాటం చేయాల్సిన అవసరముందని చెప్పారు. లగచర్ల ఘటనను స్థానిక ఎంపీగా ఉన్న డీకే అరుణ గారు కూడా కేంద్రం దృష్టికి తీసుకెళ్లి బాధితులకు న్యాయం జరిగేలా చూడాలని కోరారు.

## మేయర్ ఎన్నికల్లో ఆప్ విజయం..

బలగం టీవీ, న్యూఢిల్లీ

ఢిల్లీలో జరిగిన మేయర్ ఎన్నికల్లో ఆప్ విజయం సాధించింది. కొత్త మేయర్‌గా ఆ పార్టీకి చెందిన కౌన్సిలర్ మహేష్ కుమార్ ఖించి ఎన్నికయ్యారు. ఢిల్లీ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ ఎన్నికలో ఆప్, బీజేపీల మధ్య పోటీ హెూరాహెూరీగా సాగింది. కరోల్‌బాగ్‌లోని దేవ్‌నగర్ కౌన్సిలర్‌గా ఉన్న మహేశ్ ఖించ్‌కు 133 ఓట్లు రాగా, బీజేపీ అభ్యర్థికి 130 ఓట్లు వచ్చాయి. దీంతో ఆప్ అభ్యర్థి మహేశ్ స్వల్ప మెజారిటీతో విజయం సాధించారు. ఎస్సీ వర్గానికి చెందిన మూడో మేయర్‌గా మహేశ్ ఖించి రికార్డు సృష్టించారు.



## విద్యార్థుల భవిష్యత్తు.. రాష్ట్ర భవిష్యత్తుగా ప్రజా ప్రభుత్వం చూస్తుంది

- ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

బలగం టీవీ, హైదరాబాద్

మీ భవిష్యత్తు.. రాష్ట్ర భవిష్యత్తుగా ప్రజా ప్రభుత్వం చూస్తుంది. ఎన్ని ఒడిదుడుకులు అయినా ఎదుర్కొంటాం.. విద్యార్థుల భవిష్యత్తు కోసం ఎన్ని కోట్లయినా ఖర్చు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు వెల్లడించారు. గురువారం హైదరాబాద్ ఎల్బీ స్టేడియంలో జరిగిన బాలల దినోత్సవ వేడుకల కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తో కలిసి డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ "భవిష్యత్తు ఈ రోజు కోసం సిద్ధపడే వారిదే" అని చెప్పిన మహనీయుడు పండిట్ జవహర్ లాల్ నెహ్రూఆలోచనలను ఇందిరమ్మ రాజ్యంలో ఏర్పడిన ప్రజా ప్రభుత్వం ముందుకు తీసుకువెళ్తుంది.. విద్య వ్యవస్థకు పునాదులు వేసిన నెహ్రూ గారి బాటలోనే ప్రజా ప్రభుత్వం అధికారంలోకి రాగానే అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన విద్యను అందించడానికి రాష్ట్రంలో ఐదు వేల కోట్ల రూపాయలతో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలల ఏర్పాటు చేస్తున్నాం.. ఎన్ని ఒడిదుడుకులు అయినా ఎదుర్కొంటాం.. విద్యార్థుల భవిష్యత్తు కోసం ఎన్ని కోట్లయినా ఖర్చు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉంది" అని అన్నారు.

# ట్రిపుల్ సెంచరీలతో చెలరేగిన గోవా బ్యాటర్లు



**బలగం టీవీ, హైదరాబాద్**

రంజీ ట్రోఫీలో గోవా బ్యాటర్లు ట్రిపుల్ సెంచరీలతో చెలరేగారు. స్నేహల్ కౌథంకర్(314 నాటౌట్), కశ్యప బాక్లే(300 నాటౌట్)లు పరుగుల వరద పారిస్తూ మూడొందలు కొట్టేశారు. ఈ ఇద్దరు మూడో వికెట్‌కు 606 పరుగులు జోడించారు. దాంతో, ఫస్ట్ క్లాస్ క్రికెట్‌లో 594 పరుగులతో ఉన్న రికార్డు బద్దలై పోయింది.

రంజీ ట్రోఫీలో గోవా జట్టు విజయానికి చేరువైంది. తొలుత అర్జున్ టెండూల్కర్(5/26) విజృంభణతో అరుణాచల్ ప్రదేశ్‌ను 89 పరుగులకే ఆలౌట్ చేసిన గోవాకు బ్యాటర్లు భారీ స్కోర్ అందించారు. స్నేహల్ కౌథంకర్(314 నాటౌట్ 43 ఫోర్లు, 4 సిక్సర్లు), కశ్యప బాక్లే(300 నాటౌట్ 39 ఫోర్లు, 2 సిక్సర్లు)లు విధ్వంసం సృష్టించారు. ఇద్దరూ ట్రిపుల్ సెంచరీలతో చెలరేగగా గోవా జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 2 వికెట్ల నష్టానికి 727 రన్స్ కొట్టింది. దాంతో 643 పరుగుల ఆధిక్యం సాధించి మ్యాచ్‌పై పట్టుబిగించింది.




# తిలక్ అడిగాడు.. సూర్య ఇచ్చేశాడు

**బలగం టీవీ, హైదరాబాద్**

దక్షిణాఫ్రికాతో సెంచూరియన్‌లో జరిగిన మ్యాచ్‌లో హైదరాబాదీ బ్యాటర్ తిలక్ వర్మ టీ20ల్లో మొదటి సెంచరీ నమోదు చేసి భారత్‌ను గెలిపించిన సంగతి తెలిసిందే. అయితే సెంచూరియన్ మ్యాచ్‌లో.. మూడవ నెంబర్‌లో బ్యాటింగ్ చేసే అవకాశం తనకు కెప్టెన్ సూర్యకుమార్ కల్పించినట్లు తిలక్ వర్మ తెలిపాడు.

హైదరాబాదీ బ్యాటర్ తిలక్ వర్మ నాలుగు బదులు మూడో స్థానంలో వెళ్తానని కెప్టెన్ సూర్యను అడగడం, దానికి అతడు అంగీకరించడం.. తిలక్ కే కాదు టీమిండియాకు కూడా కలిసొచ్చింది. సెంచూరియన్ లో సెంచరీతో చెలరేగి.. సౌతాఫ్రికాపై మూడో టీ20లో టీమ్ గెలవడంలో కీలకపాత్ర పోషించాడు. దీని గురించి మ్యాచ్ తర్వాత సూర్య మాట్లాడాడు. "తిలక్ వర్మ గురించి ఇంకేం చెప్పగలను. అతడు గెబర్హాలో నా గదికి వచ్చి తనకు మూడో స్థానంలో అవకాశం ఇవ్వాలని కోరాడు. బాగా ఆడతానని అన్నాడు. నేను సరే అన్నాను. వెళ్లి చెలరేగిపో అని చెప్పాను. అడిగాడు.. చేసి చూపించాడు. చాలా ఆనందంగా ఉంది" అని సూర్య అన్నాడు. అంతేకాదు టీ20ల్లో ప్రస్తుతానికి మూడో స్థానంలో తిలకే కొనసాగుతాడని కూడా స్పష్టం చేశాడు. మూడవ నెంబర్ పొజిషన్‌ను వదులుకోవడం పట్ల సూర్యకుమార్ కూడా కామెంట్ చేశాడు. టీమ్ మీటింగ్‌ల్లో ఆట గురించి చర్చిస్తామని, నెట్ ప్రాక్టీసు, ఫ్రాంచైజీలు, రాష్ట్రాలకు ఆడుతున్న తరహాలోనే ఆడాలని సూచించామని, కొన్ని ఇన్నింగ్స్‌లో వాళ్లు విఫలం అయినా, అవకాశాలు ఇస్తామని, తెలిపాడు.

# ఆసక్తికరంగా నితిన్ 'రాబిన్‌హుడ్' టీజర్




**బలగం టీవీ, హైదరాబాద్**

వెంకీ కుడుముల దర్శకత్వంలో టాలీవుడ్ హీరో నితిన్ నటిస్తున్న చిత్రం 'రాబిన్‌హుడ్'. ఈ సినిమా డిసెంబర్ 25న థియేటర్లలో ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా తాజాగా టీజర్‌ను విడుదల చేసింది చిత్ర బృందం. 'ఆగని హైఫై ఇళ్లలో చోరీ, ఇంతమంది దాచుకున్న హనీని దోచుకెళ్తోన్న ఆ హనీ సింగ్ ఎవరు?' అంటూ అందరీ డబ్బు, బంగారాన్ని దోచే దొంగగా నితిన్‌ను చూపించడంతో ప్రచార చిత్రాన్ని ప్రారంభించారు. ఆ తర్వాత 'రాబిన్ హుడ్ వాటికి పర్టిక్యులర్ జెండా, అజెండా ఏమీ ఉండవు. డబ్బు కోసం ఎవరికైనా ఎదురువెళ్తాడు.' అంటూ నితిన్ గురించి ఎలివేషన్ ఇచ్చారు. అనంతరం 'భారతీయులంతా నా సోదర సోదరీమణులు. నా కంట్రీకి వచ్చి నా ఫ్యామిలీ మెంబర్స్‌నే ఇబ్బండి పెడతారురా, యూ బ్లడీ ఫారెనర్స్ అంటూ' నితిన్ చెప్పే డైలాగ్స్, ఫైట్స్ ఆకట్టుకున్నాయి. 'నువ్వేమో ఆ అమ్మాయిని చూసి ఎక్సైట్ అవుతున్నావ్?, నేనేమో ఆ వెనక వచ్చే వాడిని చూసి టెన్షన్ అవుతున్నాను' అంటూ నితిన్‌తో కలిసి రాజేంద్రప్రసాద్ చేసే కామెడీ బాగుంది.కాగా, ఈ రాబిన్ హుడ్? చిత్రాన్ని మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ నిర్మిస్తోంది. నవీన్ యేర్నేని, రవి శంకర్ నిర్మాతలకుగా వ్యవహరిస్తున్నారు. జీవీ ప్రకాశ్ కుమార్ సంగీతాన్ని అందిస్తున్నారు. వినోదం, సందేశంతో కూడిన యాక్షన్ థ్రిల్లర్‌గా ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నారు. సాయి శ్రీరామ్ ఛాయాగ్రాహకుడిగా వ్యవహరిస్తున్నారు. శ్రీలీల హీరోయిన్‌గా నటిస్తోంది.

# కడప అమీన్ పీర్ దర్గా వేడుకకు ముఖ్య అతిథిగా రామ్ చరణ్



**బలగం టీవీ, హైదరాబాద్**

మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ అరుదైన గౌరవం దక్కించుకున్నారు. తెలుగు రాష్ట్రాల్లోని ప్రజలు పవిత్రంగా భావించే కడపలోని అమీన్ పీర్ దర్గాను చరణ్ సందర్శించనున్నారు. ఈ నెల 18న నేషనల్ ముషాయరా గజల్ ఈవెంట్‌ను కడప దర్గాలో నిర్వహించనున్నారు. ఇక ఈ వేడుకకు ముఖ్య అతిథిగా రామ్‌చరణ్ హాజరు కానున్నారు. ఇక రామ్ చరణ్ ప్రస్తుతం గేమ్ ఛేంజర్ అనే సినిమాలో నటిస్తున్నాడు. శంకర్ దర్శకత్వంలో వస్తున్న ఈ సినిమాను దిల్ రాజు నిర్మిస్తుండగా.. థమన్ సంగీతం అందిస్తున్నాడు. .ఈ సినిమా సంక్రాంతి కానుకగా జనవరి 10న వరల్డ్ వైడ్‌గా విడుదల కానుంది.



# మ్యాక్స్‌వెల్ విధ్వంసం.. పాక్ ఓటమి

**బలగం టీవీ, హైదరాబాద్**

టీ20 సిరీస్‌లో ఆస్ట్రేలియాతో బ్రిస్బేన్ వేదికగా జరిగిన తొలి మ్యాచ్‌లో పాకిస్తాన్ చిత్తుగా ఓడింది. దాంతో ఆసీస్ 1–0తో ఆధిక్యంలోకి వెళ్లింది. గాబా స్టేడియంలో ఆసీస్– పాక్ మధ్య గురువారం తొలి టీ20 జరిగింది. వర్షం కారణంగా ఆలస్యంగా మొదలైన ఈ టీ20 మ్యాచ్‌ను ఏడు ఓవర్లకు కుదించారు. ఈ క్రమంలో టాస్ గెలిచిన పాకిస్తాన్ తొలుత బౌలింగ్ ఎంచుకుంది. దీంతో బ్యాటింగ్‌కు దిగిన ఆసీస్‌కు ఆదిలోనే ఎదురుదెబ్బ తగిలింది. ఓపెనర్లు మాథ్యూ షార్ట్(7), జేక్ ఫ్రేజర్ మెగర్క్(9) సింగిల్ డిజిట్ స్కోర్లకే పెవిలియన్ చేరారు. అయితే, వన్‌డౌన్ బ్యాటర్ గ్లెన్ మాక్స్‌వెల్(19 బంతుల్లో 43) ధనాధన్ ఇన్నింగ్స్‌తో చెలరేగగా.. నాలుగో నంబర్ బ్యాటర్ టిమ్ డేవిడ్(10) మాత్రం విఫలమయ్యాడు. తర్వాత మాక్సీకి తోడైన మార్కస్ స్టొయినిస్(7 బంతుల్లో 21 నాటౌట్) స్కోరు బోర్డును పరుగులు పెట్టించాడు. ఆస్ట్రేలియా నిర్ణీత ఏడు ఓవర్లలో నాలుగు వికెట్ల నష్టానికి 93 పరుగులు చేసింది. పాక్ బౌలర్లలో అబ్బాస్ ఆఫ్రిది రెండు వికెట్లు తీయగా.. షాహిన్ ఆఫ్రిది, నసీం షా ఒక్కో వికెట్ దక్కించుకున్నారు.

అయితే, లక్ష్య ఛేదనలో ఆరంభం నుంచే పాక్ తడబడింది. ఆసీస్ పేసర్లు నిప్పులు చెరగడంతో 64 పరుగులకే చేతులెత్తేసింది. ఓపెనర్ సాహిబ్‌జాదా ఫర్హాన్(8)ను అవుట్ చేసి స్పెన్సర్ జాన్సన్ వికెట్ల వేట మొదలుపెట్టగా.. జేవియర్ బార్ట్‌లెట్ మహ్మద్ రిజ్వాన్(0)ను డకౌట్ చేశాడు. అనంతరం ఉస్మాన్ ఖాన్(4)ను కూడా అతడు పెవిలియన్‌కు పంపాడు. ఆ తర్వాత నాథన్ ఎల్లిస్ బాబర్ ఆజం(3)తో పాటు.. ఇర్ఫాన్ ఖాన్(0) వికెట్లు కూల్చాడు. ఈ క్రమంలో మరోసారి రంగంలోకి దిగిన బార్ట్‌లెట్ ఆఘా సల్మాన్(4)ను వెనక్కి పంపగా.. నాథన్ ఎల్లిస్ హసీబుల్లా ఖాన్(12) పనిపట్టాడు. అయితే, అబ్బాస్ ఆఫ్రిది(20 నాటౌట్)తో కలిసి టెయిలెండర్ షాహిన్ ఆఫ్రిది(6 బంతుల్లో 11) బ్యాట్ ఝులిపించే ప్రయత్నం చేయగా.. ఆసీస్ స్పిన్నర్ ఆడం జంపా అతడిని బౌల్డ్ చేశాడు. అనంతరం.. పాక్ ఇన్నింగ్స్ ఆఖరి వికెట్‌గా నసీం షాను బౌల్డ్ చేసి వెనక్కి పంపించాడు. పాకిస్తాన్ ఏడు ఓవర్లలో తొమ్మిది వికెట్ల నష్టానికి కేవలం 64 రన్స్ చేసింది. ఫలితంగా ఆసీస్ చేతిలో 29 పరుగుల తేడాతో ఓడిపోయింది. గ్లెన్ మాక్స్‌వెల్ ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు అందుకున్నాడు. ఇరుజట్ల మధ్య శనివారం సిడ్నీ వేదికగా రెండో టీ20 జరగనుంది.